సంఘమర్యాదలన్నియు గంగ కలసె
మనుజ జాతికి తృప్తియే మాయమయ్యె
శీల నైతిక విలువలు చితికి పోయె
మానవత్వంబు క్షీణించె మనుజులందు

విద్యార్థులారా!

ప్రపంచములోని ప్రతి మానవునకు ఆహారము అవసరము. జీవితమునకు సంబంధించిన అవసరాలలో అత్యంత అవసరమైనది ఆహారము. అన్నము తిన్నంత మాత్రమున తృప్తి పడువాడు కాడు మానవుడు. కడుపు నిండుకున్నంత మాత్రమున అతడు యేమాత్రము సంతోషించడు. కడుపు నిండినదే గాని మనసు నిండలేదు, హృదయము పండలేదు. భుజించి కూర్చొనుట మానవ స్వభావము కాదు. తిని తిరగాలి. తిని, తిరిగి, పని చెయ్యాలి. ఈ పని చేయు సమయమునందు ఏమి చేస్తున్నాను? ఎందుకు చేస్తున్నాను? ఎలా చేస్తున్నాను? అనే మూడు ప్రశ్నలు వేసుకోవాలి. ఏమి చేస్తున్నాను, ఎందుకు చేస్తున్నాను, ఎలా చేస్తున్నాను అనే ప్రశ్నలను చక్కగా విచారణ సల్పినప్పుడు యీ కార్యమునందు విజయమును, ఆనందమును అందుకోగలడు. ఈ విధమైన పనులలో తాను ప్రపంచము తిరిగి అందులో వున్న మంచిని గుర్తించటానికి ప్రయత్నిస్తాడు. గుర్తించిన మంచిని తాను అనుభూతిలో పెట్టుకొనుటకు ప్రయత్నిస్తాడు. ఆచరించిన కర్మలద్వారా వచ్చిన ఆనందమును అనుభవిస్తాడు. తాను అనుభవించిన ఆనందమును పదిమందికి పంచుతాడు. ఇదే తైత్తిరీయోపనిషత్తు బోధించిన ప్రధాన ఉపదేశము. అన్నముతో ప్రారంభమై ఆనందముతో అంత్యము కావటమే జీవితము యొక్క పరమావధి.

ఈ తైత్తిరీయోపనిషత్తు కృష్ణ యజుర్వేదము నందలి తైత్తిరీయ శాఖలో ఆవిర్భవించినది. ఈ ఉపనిషత్తు అతి పురాతనమైనది. కనుకనే యీ ఉపనిషత్తునందు ప్రతి ఒక్కటి మంత్ర స్వరూపమే. మంత్రమనగా కేవలము ఓం నమో నారాయణాయ అనే అష్టాక్షరిగాని, ఓం నమశ్శివాయ అనే పంచాక్షరిగాని, యివి కాదు మంత్రములు. 'మనన త్రాణ సమ్మిళితం ఇతి మంత్రః' అని, మననము చేసిన దానిని మనస్సునందు స్థిరము చేసుకున్నదే మంత్రము. కనుక యీ ఉపని

షత్తునందు పలికిన ప్రతి పలుకు మంత్ర స్వరూపమే. ఒక్కొక్క చిన్న పదము కూడను మంత్ర స్వరూపముగా ఆవిర్భవిస్తూ, వ్యాపిస్తూ పోయినది. సత్యం వద, ధర్మం చర, ఓం బ్రహ్మ, సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ, ఏకం సత్ విప్రా బహుధా వదంతి, ఏకోహం బహుస్యాం, ఏకోవశీ సర్వభూతాంతరాత్మ, ఇవన్నీ చిన్న చిన్న పదముల చేతనే మంత్ర స్వరూపాన్ని ధరించి జగత్తును వ్యాపించి మానవునకు బోధించి ఆనందము నందిస్తూ వచ్చాయి. ఈ ఉపనిషత్తునందు మరొక విచిత్రమైన రహస్యము, ఒక్కొక్క ఉపనిషత్తు ఒక్కొక్క స్థాయివారికి మాత్రమే సమన్వయమైంది, ఈ తైత్తిరీయోపనిషత్తు బ్రహ్మచారులకు, గృహస్థులకు, వానప్రస్థులకు సన్యాసులకు సర్వులకు సమత్వమై సమత్వముగా బోధిస్తూ ప్రతి మానవునకు అత్యవసరమైన స్వరూపాన్ని ధరిస్తూ వచ్చింది. ఈ ఉపనిషత్తు బోధించిన ప్రతి బోధ కూడను నాలుగు ఆశ్రమముల వారికి అత్యవసరమైనవి.

ఇందులో మరొక ఘట్టము - పంచాగ్నులను గురించి ఇది ప్రబోధిస్తూ వచ్చింది. ఇవి ఐదు విధములైన అగ్నులు. ఉదరాగ్ని, మందాగ్ని, కామాగ్ని శోకాగ్ని, బడబాగ్ని. మొదటిది ఉదరాగ్ని. పదము పెద్దదేగాని దీని అర్థము చాలా చిన్నది. ఆకలిచేత తపింపబడే దానికి ఉదరాగ్ని అన్నారు. మందాగ్ని అనగా అమితముగా భుజించి అజీర్ణముతో తపించే దానికి మందాగ్ని అన్నారు. కామాగ్ని అనగా అనేక విధములైన కోరికల చేతను, వాంఛల చేతను తపింపబడే చిత్తమునకే కామాగ్ని అని చెప్పబడుతూ వచ్చింది. శోకాగ్ని. శోకాగ్ని అనగా లౌకికమైన చింతల నిమిత్తమై లౌకికమైన వాంఛల నిమిత్తమై శోకించటం కాదు. దైవదర్శన నిమిత్తమై, దైవానంద నిమిత్తమై, దైవప్రాప్తి నిమిత్తమై తాను చింతించే తాపమంతయు కూడను శోకాగ్నిగా మారుతూ వచ్చింది. భగవద్గీత యావత్ప్రపంచము, సర్వమతస్థులు అంగీకరించిన గ్రంథము. తెరచిన తక్షణమే మొట్టమొదటి అధ్యాయము విషాద యోగమన్నారు. ఏమిటి యీ విషాదము. కేవలము లోక సంబంధమైన విషయములో తాను విచారణ సలుపుతున్నాడా? బంధుమిత్రుల నిమిత్తమై తాను శోకించుచున్నాడా? ఈ విధంగా శోకించే దానికి యోగమని సార్థక నామము ఎందుకు కలిగింది? కనుక భౌతిక లౌకిక సుఖదుఃఖ సంతోషముల నిమిత్తమై లేక భోగభాగ్యముల నిమిత్తమై ధనకనక వస్తు వాహనాదుల నిమిత్తమై శోకించిన శోకము కాదిది. దైవము నిమిత్తమై, ధర్మము నిమిత్తమై తాను శోకమునకు గురి అయ్యాడు. యుద్ధము వల్ల అనేక ప్రాణములు నశించి పోతాయి. ఈ పురుషులు నశించి పోవటం చేత ధర్మగ్లాని కలుగుతుంది. వర్ణ

సంఘరము ఏర్పడుతుంది. ధర్మము నశిస్తుంది. కనుక ధర్మమును లక్ష్యమునందుంచుకొని, దైవమును దృష్టియందుంచుకొని అర్జునుడు శోకించటం చేత యీ విషాదము యోగంగా మారింది. ధనకనక వస్తు వాహనాదులకై శోకించటము లేదు. కేవలము దైవము నిమిత్తమై, ధర్మము నిమిత్తమై తాను శోకించుతూ వస్తున్నాడు. కనుకనే దీనికి శోకాగ్ని అనిపేరు. బడబాగ్ని అనగా భయంకరమైన రోగముల చేత మరణము చేత తపించటము. ఈ ఐదు విధములైన అగ్నులు కేవలము భౌతికమైన శరీరమునకు సంబంధించినవి మాత్రమే. తద్భిన్నమైన ఆత్మకు యిది యెమాత్రము సంబంధము లేదు. ఈ ఐదు విధములైన అగ్నులకు తాను సాక్షీభూతమై వుంటున్నాడు. ఇట్టి సాక్షీభూత తత్వాన్ని జగత్తుకు చాటే నిమిత్తమై యీ పంచాగ్నుల యొక్క ప్రమాణములను ఆధారముగా చేసుకొని ప్రజలకు బోధిస్తూ వచ్చింది ఉపనిషత్తు.

దీనియందు మరొక అంతర రహస్యము కూడను ఒకటి వుంది. మానవునియందు నాలుగు విధములైన తరగతులుగా వుంటున్నారు. దైవ, మానవ, దానవ, పశుత్వమని. ఈ దైవ మానవ అసుర పశుత్వములను వుండిన తత్వములో మానవ దైవము అని మొట్టమొదటిది. దైవం మానుషరూపేణా. 'బ్రహ్మతిష్ఠ భవో విష్ణుః', హృదయమునందు విష్ణుస్వరూపకముగా ధరిస్తూ వుంటుంది. దైవత్వము హృదయమునందు నింపుకొని సర్వకర్మలు దైవప్రీత్యర్థంగా ఆచరించి సర్వులయందు వున్న ఆత్మతత్వమే తనయందు వున్నదని విశ్వసించి, దయాప్రేమల చేత సర్వప్రాణులను ప్రేమించి యీ విధమైన ఏకాత్మ భావమును విశ్వసించి తనయొక్క జీవితమును దైవార్పితమైన భావములో ఆచరించటమే మానవ దైవత్వమని. రెండవది. మానవ మానవత్వము. సత్య ధర్మ భవో మర్త్యః అనగా యీ మర్త్యలోకములో సత్యము ధర్మము దృష్టియందుంచుకొని యీ సత్యధర్మములను ప్రచారప్రబోధలు సల్పుతూ దయా కరుణా మడెములతో జనులను ప్రేమిస్తూ కేవలము మానవుడు మానవత్వమును పోషించుకునే నిమిత్తము అవతరించినవాడని గుర్తిస్తూ మానవుడు మానవుడుగా జీవించాలనే విషయాన్ని తాను అర్థము చేసుకొని, దాన ధర్మములు ఆచరిస్తూ మనోవాక్కాయ కర్మలు ఏకత్వం గావించుకుంటూ తనయొక్క జీవితములో గృహస్థుడుగా వుండినప్పటికిని కర్తవ్య కర్మలు నిర్వర్తించుకుంటూ దివ్యమైన జీవితమును మానవఆదర్శముగా నిరూపిస్తూ వచ్చేటువంటిది. ఇది మానవ మానవత్వమని, ఇంక మానవ దానవత్వము. 'సురాపానం భవో దానవః'. తాను కేవలము సురాపానము గావించుకుంటూ, జీవులను హింసించుకుంటూ స్వార్థ స్వప్రయోజనముల నిమిత్తమై పరులను బాధించుచూ తనయొక్క తృప్తిని తాను గావించుకుంటూ కేవలము దయారహితుడ

ప్రేమ రహితులై, కరుణారహితులై స్వార్థ స్వప్రయోజన జీవితము గడపటం కేవలం దానవత్వముగా రూపొందించుకుంటూ వచ్చింది ఉపనిషత్తు. ఇంక మానవ పశుత్వము. 'జ్ఞానేన శూన్యః పశుభి స్సమానః'. పశుత్వమనగా ఏమిటి? ఇంద్రియానుభవమే జీవిత లక్ష్యమని, ఇంద్రియ భోగమే తన జీవిత పరమావధియని, పుట్టినది మొదలు గిట్టునంత వరకు యింద్రియ భోగములనే అనుభవించుకుంటూ ఆహార నిద్రా భయ మైథునాదులతో జీవితము గడుపుతుంటూ, యీ విధమైన జీవితములో తనయొక్క మానవత్వమునే మరచిపోవటము. ఆహార నిద్రా భయ మైథునాదులు మనుష్యునకు పశువునకు సమానమే. పశువునకు మనుష్యునకు వుండిన వ్యత్యాసమేమిటి? నిత్యానిత్య విషయం పరిశీలన శూన్యమైనప్పుడే తాను పశువుతో సమానమవుతాడు. ఈ నిత్యానిత్య విషయ పరిశీలన ఎప్పుడు చేయటంలేదు. స్వార్థ స్వప్రయోజనము హృదయములో నింపుకున్న వ్యక్తి మాత్రమే యీ నిత్యానిత్య విషయ పరిశీలనను ఘనము కానడు. పశుత్వమనగా మానవుడుగా వుండి పశుగుణముల యందే పశుప్రవర్తన యందే జీవితమును అంకితము గావించుకోటం. మానవుడు శ్రేష్ఠమైన దివ్యత్వమును పొందటం సరియైన ఉత్తమ మార్గం. అట్టి దైవత్వమును పొందుటకు సాధ్యము కానప్పుడు మానవుడు మానవత్వము పొంది జీవితము సార్థకము గావించుకోటం యిది ఒక ధర్మము. కానీ మానవుడు దానవుడుగను, పశువుగను మారటము యిది మహా విరుద్ధమైన ధర్మము.

ఈ విధమైన చర్యలు యీనాడు జగత్తునందు వ్యాపించి పోవటం చేత మానవత్వమే మరుగుపడి పోతున్నది. నీతి నిజాయితీ శూన్యమై పోయినవి. సంఘ మర్యాదలు అంతకంటె నిర్మూలమై పోయినవి. సంఘము అంటే తాను అర్థము చేసుకోలేని పరిస్థితియందు తన జీవితమును వ్యర్థము గావించుకుంటున్నాడు. సంఘమనగా కేవలము తలల యొక్క చేరిక అని భావిస్తున్నాడు. కాదు. కాదు. సంఘమనగా అనేకత్వములో వున్న ఏకత్వాన్ని గుర్తింప చేసేదే. అందరు కలసి ఏకకాలములో ఏక కర్మను ఆచరించి ఆ కర్మ ఫలితమును ఏకాత్మగా భావించి అందరూ అనుభవించుకోటమే సంఘము యొక్క ప్రధానమైన కర్తవ్యము. మానవుని యొక్క నిజమైన సుఖము ద్వారానే అనుభవించటానికి వీలౌతుందనే సత్యమును గుర్తించటమే సంఘము యొక్క అంతరార్థము. సంఘము తనకుండిన తానేవాడు తన సుఖసంతోషములన్ని సమాజముపైననే ఆధారపడి వుంటున్నాయి. ఈ సత్యమును గుర్తించుకోలేని వ్యక్తి మాత్రమే తన స్వార్థము స్వప్రయోజనమునకు పాటుపడతాడు.

తైత్తిరీయోపనిషత్ యీ పంచాగ్నుల యొక్క ప్రమాణములు నాలుగు

తరగతుల మానవులను చక్కగా వివరించింది. విద్యార్థులు తమ యొక్క గురువుల వద్ద విద్యనభ్యసింప చేసుకొని, విద్యను పూర్తి గావించుకొని, గృహస్థాశ్రమములో ప్రవేశించే సమయమందు అధ్యాపకులు పిల్లలను చెంత చేర్చుకొని వారు భవిష్యత్తులో ఏవిధమైన జీవితమును గడపవలెనని వారికి సందేశ వుపదేశములు గావించునది తైత్తిరీయోపనిషత్తు. ఇందులో ప్రేయోమార్గమని ఒకటి శ్రేయో మార్గమని మరొకటి. ప్రేయో మార్గమనగా కేవలము అప్పటికప్పుడు ఆనందము నందించే ఇంద్రియముల యొక్క ఫలితము. ఇవి తాత్కాలికమైన సుఖములు. ఇవి అనిత్యము అసత్యములు అయినవి. ఇట్టి ప్రేయో మార్గమునే ప్రజలు అనేకమంది ఆశిస్తూ వుంటారు. కాని నిత్య సత్యమైన శ్రేయో మార్గమును అనేకమంది ఆశించటం లేదు. కారణమేమనగా కావి కొంత కాలమును తీసుకుంటాయి. మానవుడు ఫలితమును అంతకాలము వేచి వుండుటకు అంగీకరించడు. మానవుని వేగము అన్నింటియందు చాలా అధికముగా వుంటుంటాది. అన్నింటికి పరుగులిడు వాడు మానవుడు. ఆశించే ఆశలయందు తనకు అనుకూలమైన ఆశలను మాత్రమే దృష్టియందుంచుకుంటాడు. మంచి పదవులు, మంచి పేరు, మంచి ప్రతిష్ఠలు, మంచి జీవితము కావాలని కోరుతుంటాడు. కాని మంచి జ్ఞానము, మంచి నడత, మంచి బుద్ధులు కావాలని ఆశించడు. మంచి గుణములు, మంచి నడత, మంచి ప్రవర్తన, మంచి జ్ఞానము అందించేదే శ్రేయో మార్గము. అప్పటికప్పటి పదవులను, గౌరవములను, కీర్తులను ఆశించేది ప్రేయో మార్గము. పిల్లలను పిల్చి అధ్యాపకులు 'విద్యార్థులారా! విద్యయొక్క పరమావధి ఏమి? విద్యయొక్క పరమావధి వినయమే. నమ్రతనే ప్రధానమైన దృష్టి. శీలమే ప్రధానమైన ప్రాణము. ఇవన్నియు పిల్లలకు బోధించి దానికి శిక్షావల్లి అను పేరును పెట్టి దానిని భవిష్యత్తునందు గృహస్థ మార్గములో మీరు నిత్య ధర్మము సత్యమార్గములో అనుసరించాలని ప్రబోధిస్తూ వస్తుంది.

'మాతృదేవోభవ', 'పితృదేవోభవ'. మొట్టమొదట తల్లి తండ్రులను గౌరవించండి. ఎలాంటి పరిస్థితులందైనా సత్యమును విడనాడకూడదు. ధర్మమును లేశమాత్రము తప్పకూడదు. ఈ విధమైన ప్రబోధల చేత ఆనాటి విద్యార్థుల హృదయములు పరిపూర్ణమైన తృప్తిని గావించి, సన్మార్గములో ప్రవేశపెట్టి మానవత్వమును దివ్యత్వముగా మార్చుగలిగింది. ఈనాటి విద్యలన్నియు మానవత్వాన్ని దానవత్వముగాను పశుత్వముగానూ మారుస్తూ వస్తున్నది. ఈనాటి విద్యలు కేవలము తెలివితేటలనే పెంచుతున్నవిగాని గుణములను మాత్రము పెంచటం లేదు. కృతజ్ఞతను చూపటం లేదు గాని కృతఘ్నులుగా తయారౌతున్నారు. ఇది విద్యకు విరుద్ధమైన

530059106

మార్గము. నేను మొన్ననే చెప్పాను విద్యయొక్క ప్రోగ్రెస్సు ఏమిటని.

మేలు చేసిన వానికే కీడు జేయు
కూడు పెట్టిన వానినే కూలద్రోయు
విద్య నేర్పిన వానినే వెక్కిరించు
ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యయందు.

ఈనాటి విద్యలలో ఈవిధమైన వికారమైన స్వభావములు విపరీతమైన మార్గములు అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. ప్రతి మానవుడు కూడను నీతి నిజాయితీ యని ప్రబోధిస్తున్నాడు. పదములు మాత్రమే ఉచ్చరిస్తున్నాడు. కాని

నీతి నియమాలు గ్రంధాన నిల్చిపోయె
హృదయమంతయు దుర్గంధ సదనమయ్యె
చేతలంతయు స్వార్థంపు చేతలయ్యె
ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యయందు.

పూర్వము ఈవిధముగా కాదు. సత్యం వద. సత్యమునే చెప్పాలి. ధర్మమునే ఆచరించాలి. తల్లి తండ్రులను గౌరవించాలి. అదియే ప్రధానమైన కర్తవ్యము. ఎందుకు ఈవిధంగా చెయ్యాలి. భవిష్యత్తులో దీని ప్రతిబింబమే - reaction, resound, reflection, నీ జీవితములో ఆదర్శముగా వుంటాయి. ఈనాడు తండ్రిని అగౌరవము చేస్తే నీ కుమారుడు నిన్ను అగౌరవము చేస్తాడు. ఈనాడు నీవు నీ మిత్రుని మోసం చేస్తే రేపటి దినము నీ మిత్రుడు నిన్ను మోసం చేస్తాడు. కనుక ఏమి చేస్తే అది దాని యొక్క reaction నీవు అనుభవించవలసి వస్తుంది. ఈనాడు నీవు నీ తల్లి తండ్రులను గౌరవించినప్పుడు రేపు నీ బిడ్డలు నిన్ను గౌరవిస్తారు. కనుక భవిష్యత్తులో నీ యొక్క మంచి చెడ్డలన్నియూ వర్తమానములో ముడిపడి వుంటున్నవి. కనుక భవిష్యత్తు యొక్క మంచి చెడ్డలన్నికూడను వర్తమానమునందు చక్కగా ముడి విప్పి ముక్తమైన స్వరూపమును చూపిస్తూ వచ్చింది తైత్తిరీయోపనిషత్తు.

సర్వత్ర నిండినది బ్రహ్మతత్వమొక్కటే. బ్రహ్మతత్వమనగా ఏమిటి? విశాలమైన చైతన్యము. ప్రతి మానవుని యందు కూడను ఈ చైతన్యమనేది సమంగానే వుంటున్నది. ఈ చైతన్యమైనది జగత్ వ్యాప్తి యైన చైతన్యము చేత ఒక సంకుచితమైన చైతన్యంగా రూపొందుతూ వచ్చింది. మానవుని యందుండిన చైతన్యము సంకుచితమైన చైతన్యము. సర్వత్రా వ్యాపించిన చైతన్యము అనంత చైతన్యము. ఈ అనంత చైతన్యము లోపల ఈ సంకుచితమైన చైతన్యమును చేర్చుకోవాలి. ఎట్లా సాధ్యమవుతుంది. ఇప్పుడు సర్వత్ర గాలి వుంటున్నది. ఒక బెలూన్ లో గాలి వూదినాము. కాని బెలూన్ కట్టి వేసినప్పుడు ఆ

బెలూన గాలి బెలూన్‌కు మాత్రమే పరిమితమై వుంటున్నది. సర్వత్రా వ్యాపించిన గాలి సర్వత్రా సంచరిస్తూనే వుంటున్నది. ఇతే యీ సంకుచితమైన, యీ పరిమితమైన గాలి సర్వవ్యాపకమైన గాలిలో చేరాలనుకున్నప్పుడు ఏమి చేయాలి? ఆ బెలూన్ అధికంగా వూదుతూ వూదుతూ పోయేటప్పటికి ఆ బెలూన్ burst అయిపోయి, ఆ బెలూన్ సంకుచితమైన యీ అనంతమైన యీ గాలిలో లీనమై పోతుంది. ఇదేవిధముగానే తన దేహమనే బెలూన్‌లో వుండే యీ చైతన్యము సంకుచితముగా వుంటున్నది. నేను నావారు, నేను నావారు అని సంకుచితమైన చైతన్యంగా వుంటున్నది. కాని దీనిని అనంతంగా వ్యాపింప చేసుకొని ఏకాత్మ సర్వభూతాంతరాత్మ అందరిలో వుండినటువంటిది నాలో వుంటున్నది ఆత్మనే. ఏకత్వమనే భావమును మనము అభివృద్ధి గావించుకోవాలి. ఇది అది ఒకటే. ఈ సమత్వంలో మనము అభివృద్ధి గావించుకుంటూ పోవటం చేత యీ సంకుచితమైన హృదయము అన్నివిధముల చెదిరి పోయి అనేకత్వమైన చైతన్యములో లీనమై పోతుంది. కనుకనే మనము యీ సంకుచిత భావాలనంతా కేవలము దూరము చేసుకోవాలి. అనంతమైన భావాన్ని మనము అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే ప్రపంచము సుఖశాంతులతో ఆనందము నందిస్తుంది

ఈనాడు ప్రపంచములో జరిగే యీ దురాచారములకు దుష్ప్రవర్తనలకు మూలకారణము సంకుచితమైన భావమే. ఈ స్వార్థము స్వప్రయోజనమే దీనికి మూలకారణము. కనుక గుణమును పోషించుకొనుటకు తగిన విద్యలు మనదగ్గర కనుపించటంలేదు. కేవలం గ్రంథ పరిచయము మాత్రమే మనదగ్గర కనబడుతున్నది. దీని వల్ల ప్రయోజనము లేదు. Practical knowledge లోపల ప్రవేశించాలి. ఈ Practical knowledge లో కొన్ని విధములైన అనుభూతులను మనము అందుకోవాలి. ఈ Practical knowledge అనుభవించటానికి మొట్టమొదట పట్టుదల Determination వుండాలి. అది లేకుండా యీ practical knowledge ని మనము యేమాత్రము సాధించలేము. ఈనాటి విద్యార్థులందరు 99 భాగములు superficial knowledge లో నిల్చి పోతున్నారు. పుస్తకం మస్తకం. పుస్తకం మస్తకం. ఈ రెండింటిని మాత్రమే ఏకం చేసుకుంటున్నారు. ఏమిటిది? ఇలాంటి విద్యల వల్ల దేశమునకు కలిగే వుపకారము ఏమిటి? సమాజమునకు ఏమి సహాయము చేస్తుందది? ఏమాత్రము సహాయము లేదు. ఏపని చేసినప్పటికిని, తనకు, తన సమాజమునకు ఎట్టి ఫలితము వుంది అని విశాలమైన భావములో విచారణ సల్పాలి. కనుక పూర్వము ఋషులందరు ఉపనిషత్కాలము లోపల పిల్లలను గృహస్థాశ్రమమునకు పంపించు సమయములోపల యీ విశాలమైన భావములనంతా వారి హృదయాలకు నింపి పంపిస్తూ వచ్చారు. "సత్యాన్న ప్రమదితవ్యం ధర్మాన్న ప్రమదితవ్యం, కుశలాన్న ప్రమదితవ్యం, స్వాధ్యాయాన్న

530059108

ప్రేమ తత్వం! ఈ విధంగా బోధిస్తూ వచ్చారు. నాయనా! మానవునకు కష్టములు, సుఖములు వెంటాడుతూ వుంటాయి. కానీ వాటికి బెదరక, చెదరక, స్థిరముగా వుండు. ఎలాంటి పరిస్థితులలోనైనా నీవు సత్యాన్ని మాత్రం తప్పవద్దు. నీ ధర్మాన్ని మాత్రం వీడ వద్దు. నీ హృదయాన్ని సంతృప్తి పరచే దానిని. ఆత్మ తృప్తిని మాత్రము విడువ వద్దు. ఆ Conscience ను తృప్తి పరచాలి. ఈనాడు ఏ మానవునికి Conscience అనేదే లేదు. దానిని తృప్తి పరచటానికి అంతకంటె ప్రయత్నం చేయటం లేదు. ఆత్మసాక్షి అని చెబుతూ వచ్చారు. కనుకనే follow the master, అంటే నీ ఆత్మ నీ conscience నీవు follow చెయ్యి. Face the devil. Fight to the end. Finish the game ఇది నిజమైన జీవిత మార్గము. కానీ యీ విధమైన సత్యసూత్రాలు యీనాటి విద్యలో ఎక్కడా కనుపించటంలేదు.

విద్య అనగా ఆత్మవిద్యయే. అన్ని విద్యలు అపర విద్యలు. కేవలము పొట్టకూటి కోసమై నేర్చే విద్యలు. ఈ విద్యలు కూడా అవసరమే. కాని దీనితో పాటు ఆత్మవిద్యను కూడను మనము అలవరచుకోవాలి. మానవునకు కేవలము యింద్రియములు వుండినంత మాత్రమున ఆహార నిద్రా భయ మైథునాదులు జీవితము సార్థకము గావించుకోవచ్చు కానీ వాటికి అతీతమైన మనస్సు బుద్ధి ఆత్మ కూడ వుంటున్నాయి. వాటి యొక్క తృప్తిని కూడను మనము దృష్టిలో పెట్టుకోవాలి. కానీ యీనాటి మానవుడు కడుపునిండుకు అన్నము, కంటినిండుకు నిద్ర, యింటి నిండుకు పిల్లలు, యింత మాత్రమే చాలు, యిదే జీవిత పరమావధి యని భావిస్తున్నారు. ఇది ఒక సంకుచితమైన భావమే. దీనికంటె యింకా అతీతమైనది వుంటున్నది. మానసిక తృప్తి అత్యవసరము. దీనివల్ల మనకు మానసిక తృప్తి కలగటం లేదు. ఈ మానసిక తృప్తి ఒక శ్రేయో మార్గమునందే లభిస్తుంది. శ్రేయోమార్గమనగా అతీతమైన దివ్యమైన భావము రావాలి. ఇది మానవత్వానికంటె ఉన్నతస్థాయిని పొందేది. అదే దివ్యమైన తత్వము. దివ్య భావమే మానవుని యందు లేకపోతే మానవత్వము శూన్యమై పోతుంది. కనుక విద్యార్థులారా! మానవత్వము పెంచుకునే విధానము గుర్తించుకోవాలి. మానవుడు మానవుడుగానే జీవించాలి. తోటి మానవులను ప్రేమించలేని మానవుడు, తల్లిని ప్రేమించలేని మానవుడు, భార్యను ప్రేమించలేని మానవుడు, మానవుని ప్రేమించలేని మానవుడు భగవంతుని ఏ విధముగా ప్రేమించగలడు? యిది అసాధ్యము. కనుక మొట్టమొదట తోటి మానవుని ప్రేమించటానికి ప్రయత్నించు. కేవలము ప్రేమ అనేది అప్పటికప్పుడు పెరిగి అప్పటికప్పుడు క్షీణించేది కాదు. పెరిగి క్షీణించే ప్రేమ ప్రేమయే కాదు. ఎప్పుడు పెరుగుతూ పెరుగుతూనే పోవాలి. ఇదే అనంతమైన తత్వము. దీనినే Love is God, Live in Love.

అంతేగాని యీ లౌకికమైన దానిలో కాదు మనము ముడివేసుకోవలసినది. ఇలాంటి పవిత్రమైన చిన్న చిన్న పదములతోనే తైత్తిరీయోపనిషత్తు విద్యార్థులకు చక్కని ఉపదేశము గావిస్తూ వచ్చింది. ఇంకనూ విద్యార్థులకు అవసరమైన ముఖ్యమైన అంశాలు యిందులో వుంటున్నవి. తరువాత కార్యక్రమము వుంటున్నది. కనుక యీ విషయములను ముందు ముందు మనం చర్చించుకుందాం.

విద్యార్థులారా! కేవలము లౌకికమైన విద్యలే ప్రధానమని మరచండి. మానవత్వము కంటె మించిన మరొక విద్యలేదు. మానవత్వము లేని విద్యలు ఎన్ని వుండినప్పటికీ ప్రయోజనము లేదు.

ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము
తన్నానటు వ్రాత తప్పింప నెవరితరము
చెడ్డ బుద్ధులు తన తల చేరెనేని
ఎండ బారును బుద్ధులు బండబారు.

అలాంటి విద్యలు విద్యలుకాదు. ఈ లౌకిక విద్యలు అత్యవసరమే. ఈ పరిశోధనలు అవసరమే, కాని యీ ఆధారమైన విద్యను, మూలమైన విద్యను, సూత్రమైన విద్యను, ప్రధానమైన ఆత్మభావములో అభ్యసించవలసిన విద్య. అదే మూలము. ఇదంతా స్థూలము. మూలము లేకుండా స్థూలము వుండగలదా? ఈ టంబ్లరు యిక్కడ నిల్చింది. ఇది కేవలము స్థూలము. టేబులు మూలము. ఈ టేబులు యిక్కడ నిల్చింది. ఈ టేబులు స్థూలము. కాని భూమి మూలము. ఒకటి ఆధారము ఒకటి ఆధేయము. ఆధారమును వదలి ఆధేయమును పట్టుకొని మనము అవస్థలపా గురౌతున్నాము. ఆధారమును మనము అర్థము చేసుకోవాలి. అదే ఆత్మవిద్య. ఈ ఆత్మవిద్య వల్లనే సర్వము గుర్తించటానికి వీలౌతుంది. ఒకదానిని తెలుసుకుంటే సర్వమూ తెలుసుకున్నవారమవుతాము. అదే unity in Diversity. ఈ సత్యాన్ని ప్రబోధించేదే ఉపనిషత్తులు. ఈనాటి విద్యావిధానములో ఉపనిషత్తులుగాని, బ్రహ్మసూత్రములుగాని, వేదములుగాని, పురాణములు గాని యే మాత్రము బోధించే అవకాశము లేకుండా వుంది. మానవత్వములో వున్న పరిపూర్ణమైన విలువలన్నీ అందులోనే వుంటున్నాయి. అవిలువైన డైమండ్స్ ను, మణులను విడచి పెట్టి బాగులకోసమై ప్రాకులాడుతున్నారు. ఈ బాగ్సు ఏమాత్రం మనకు ప్రయోజనం లేదు. మనము యీ డైమండ్సును సంపాయించుకోవాలి. ఆ డైమండ్సు ఎప్పుడు మనకు చిక్కుతాయి, ఈ లౌకికమైన విషయములందు మనసు నాశనము చేసినప్పుడు, die mind is di mond ఈ మనస్సు యీ భౌతికమైన వస్తువులలో కొంతవరకు తగ్గించుకోవాలి. ఎంతదాన్ని

గొప్ప విద్వాంసులు లోకములో వుంటున్నారు. పెద్దపెద్ద డిగ్రీలు తీసుకుంటున్నారు. పెద్ద పెద్ద పదవులు పొందుతున్నారు. కాని ఏమి ప్రయోజనము. ఈ లౌకికమునందే వారి జీవితమును అంత్యము చేసుకుంటున్నారు. ఎంతకాలమైనప్పటికిని తిన్న కడుపుకే తింటున్నారు. కడిగిన ముఖమునే కడుగుతున్నారు. జీవితము యొక్క పరమార్థ మేమిటి? వారికి యేమి అర్థం కావటం లేదు. డబ్బును సంపాయించవచ్చు బ్యాంకుల్లో పెట్టుకోవచ్చు యింకా అవసరమైతే విదేశాల్లో పెట్టవచ్చు. కాలము చెల్లి కళ్ళు మూసుకుంటే అంతా వెళ్ళిపోతుంది. ఈ ధనము ఏమి చేస్తుందాది. జ్ఞాన ధనమును మనము సంపాయించుకోవాలి. దివ్యమైన ఉన్నత స్థలమును సంపాయించుకోవాలి.

విద్యార్థనము చెడేది కాదు. ఈ విద్యా చదివేపోయే విద్యా. పరీక్షల నిమిత్తమై రాత్రింబవలు బాధపడి చదువుతూ వున్నారు. ఆగ్రంథములో వున్న విషయాలను మస్తకములో చేర్చుకుంటున్నారు. Examination hall కి పోతున్నారు. Head లో వున్న దంతా పేపర్లో కుమ్మరించి empty head తో యింటికి వస్తున్నారు. ఏమి ప్రయోజనము? ఒక వారమైన తరువాత ఆపుస్తకము లోనే తిరిగి అడిగితే దానికి answer చిక్కదు. ఇది తాత్కాలికమైన పరీక్షల పత్రము కట్టుకోటం కోసమని చదువుతున్నారు. ఇలాంటి విద్యల వల్ల లోకానికి యే మాత్రం వుపయోగం లేదు. ఏదో మీ పొట్ట మరు నింపుకోవచ్చు. నీ కుటుంబమును నీవు పోషించుకోవచ్చు. అంతేగాని జగత్తునకు యే మాత్రమూ వుపయోగము లేదు. జగత్కళ్యాణమును కోరాలి యీనాడు విద్యార్థులు. అందువలనే విద్యార్థులలో వివేకము క్షీణించిపోయింది. విశాలహృదయమంతా నాశనమై పోయింది. స్వార్థము, స్వప్రయోజనము వల్లనే అల్లర్లు అలజడులు జరుగుతున్నాయి. అందువల్లనే లోకము అశాంతిమయమై పోతున్నది. గురువంటే విశ్వాసము లేదు. గురువు అంటే గౌరవము లేదు. తల్లితండ్రుల అంటే ప్రేమ లేదు. ప్రజలంటే అభిమానము లేదు. ఏమిటి ఇక మానవత్వము. ఎక్కడ వుంది దీనిలో మానవత్వము. మొట్టమొదలు మానవత్వము అభివృద్ధి పరచుకునే చదువులు చదవాలి. ఒక పశువుకి ఒక season, reason వుంటుంది. ఈనాటి మానవునికి no reason no season. పశువులే మేలు కదా! అవి ఏ యూనివర్సిటీకి పోతున్నాయి. ఏ డిగ్రీలు పొందుతున్నాయి. ఏ అధికారం చేబడుతున్నాయి. ఏమిటి లేదు. కానీ అవి morality ని సంపాయించుకుంటున్నాయి. యిది కాదు. ఈనాటి విద్యార్థులందరు కూడను నీతి నిజాయితీలను పెంచుకోవాలి. మానవతా విలువలు అభివృద్ధి

53005911I

గావించుకోవాలి. సైన్సు పైకి ఎగిరి పోతుండాది. ఆకాశమునకు ఎగిరి పోతున్నది. కాని senses క్రిందికి దిగజారి పోతున్నాయి. ఇది science development. కాదు. కాదు. senses ను అదుపులో పెట్టుకోవాలి. మానవుడు లక్షలమైళ్ళ అంతరిక్షయానము సలుపుతున్నాడుగాని హృదయాంతరాళమునకు అరయించి అయినా పోవటం లేదు. ఇది కాదు మనం చేయవలసింది. హృదయ పరిశీలన జరపాలి. మన అంతరాత్మను సాక్షిగా పెట్టుకోవాలి. అప్పుడే నిజమైన మానవత్వము మనలో ఆవిర్భవిస్తుంది. విద్యార్థులారా! భక్తిప్రపత్తులనగా కేవలము భజనలు చేయటము పూజలు చేయటము యింత మాత్రమే కాదు. హృదయ విశాలతను గావించుకోవాలి. శాంతి సహనాలు పెంచుకోవాలి. పవిత్రమైన ప్రాణ సమానమైన ప్రేమను మనం అభివృద్ధి గావించుకోవాలి. ప్రేమలేక జీవితము లేదు. కనుక ప్రేమ అత్యవసరము.